తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## భూ సేకరణ పెండింగ్ పనులను పూర్తి చేయండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, మే 9 (ప్రభాతవార్త : వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్, కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్, కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే భూసేకరణ పురోగతి పనులపె జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాళహస్తి, సూళ్లూరు పేట ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, సంబంధిత మండలాల తహాశీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్, కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన గ్రామాల్లో భూసేకరణ పెండింగ్, రోడ్లు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్‌రెడ్డి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్, ఆర్అండ్ బి ఎస్ఈ మధుసూధన్‌రావు, సంబంధిత మండలాల తహాశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల తర్వాత...
# అవినీతి సిబ్బంది తొలగింపు



కాణిపాకం, మే 9 (ప్రభాతవార్త: అవినీతి నిరోధకశాఖ శాఖ ఆకస్మిక తనిఖీల్లో అక్రమాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిన సిబ్బందిని విధుల నుండి పూర్తిగా తొలగించాలని నాలుగేళ్ల తర్వాత దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్వరులు జారీ చేసిన సంఘటన కాణిపాకం దేవస్థానంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో 2021 ఫిబ్రవరి 6న అవినీతి నిరోధకశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాణిపాకం ఆలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు నిఘా పెట్టి ఏసీబి ఏఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనిశా అధికారులు, సిబ్బందితో కలసి దేవస్థానంలోని పలు ప్రాంతాలలో ఏకకాలంలో ఉదయం నుండి రాత్రి వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్బంగా దేవస్థానం పరిధిలో నగదు లావాదేవీలు కలిగి వున్న టిక్కెట్ కౌంటర్లు, డొనేషన్ కౌంటర్లు, ఆర్జితసేవా కౌంటర్లు, వసతి గదుల కౌంటర్లు తదితర ఏడు కౌంటర్లులో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే దేవస్థానం ఫలసరుకుల గోడౌన్‌ను తనిఖీ చేసి సరుకులు వ్యత్యాసం వున్నట్లు గుర్తించారు. అలాగే దేవస్థానంకు సంభందించి పలు రకాల టెండర్లు, ఇంజనీరింగ్ పనుల నిర్వహణకు సంభందించి రికార్డులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా దేవస్థానంకు సంభందించి నగదు లావాదేవీలు కలిగి వున్న ఏడు కౌంటర్లులో సుమారు 11 వేల రూపాయలు రికార్డుల కన్నా అధికంగా వుండడాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈమేరకు విధి నిర్వహణ, పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి ఆలయ ఈఓ ఎ.వెంకటేశుతో పాటు అక్రమాలకు పాల్పడిన నలుగురు రెగ్యులర్ భజంత్రీలు ఇతర సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని అనిశా అధికారులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. అలాగే కౌంటర్లులో విధులు నిర్వహిస్తూ అవినీతీ అక్రమాలకు పాల్పడిన తాత్కాలిక బ్యాంకు ఉద్యోగులు జి.సురేష్, బి.కరుణాకర్, కె.తేజేష్, ఆలయ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎ.చిదంబరం, వి.కనకరాజులు, కె.హరిబాబు, ఎస్. పృద్వీరాజ్, కె.బాలకృష్ణలను విధుల నుండి పూర్తిగా తొలగించాలని అనిశా అధికారుల నివేధిక మేరకు కాణిపాకం దేవస్థానం అధికారులను ఆదేశిస్తూ దేవాదాయశాఖ కార్యదర్శి వినయ్ చంద్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అప్పటి ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, నలుగురు రెగ్యులర్ భజంత్రీలు, మరో ఇద్దరు రెగ్యుల్ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గతంలోనే దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆలయ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా కౌంటర్లులో అవినీతికి పాల్పడిన మరో ఎనిమిది మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుండి పూర్తిగా తొలగించాలని గత కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు. ఈసంఘటనకు సంభందించి నాలుగేళ్ల తర్వాత చర్యలకు ఉపక్రమించడం ఆశ్వర్యాన్ని కల్గిస్తోంది. ఈవిషయమై ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌ను వివరణ కోరగా అనిశా అధికారుల నివేదిక ప్రకారం ఆలయంలోని ఎనిమిది మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుండి తొలగించాలని దేవాదాయశాఖ కార్యదర్శి వినయ్ చంద్ కమీషనర్‌ను ఆదేశిస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు కమీషనర్ నుండి తమకు ఆదేశాలు అందిన వెంటనే సంభందిత సిబ్బందిని విధుల నుండి తొలగించడం జరుగుతుందని ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

## డ్రైనేజీ కాలువల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



తిరుపతి కార్పొరేషన్, మే 9 (ప్రభాతవార్త : నగరంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, అఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. నగరంలోని కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద, కరకంబాడి మార్గంలోని సిపిఆర్ అపార్ట్మెంట్ వద్ద, రామానుజ కూడలి నుండి శంకరంబాడి కూడలి వరకు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులతో కలసి శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాలువల వలన ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అలాగే గరుడ వారధి డివైడర్ల మధ్యలో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని, అలాగే పూల మొక్కలు కూడా ఎక్కువగా నాటి సుందరంగా ఉండేలా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, డి.ఈ.లు రాజు, ఏసిపిలు బాలాజి, మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, ఆప్కన్స్, ఏఈకాం ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## ఒంటినిండా బొగ్గుపొడితో...
# మాతంగి వేషంలో భక్తులు మొక్కులు




తిరుపతి(రవాణ),మే 9(ప్రభాతవార్త: ఒళ్ళంతా నల్లబొగ్గుపొడి రాసుకుని, శరీరంపై ముఖంపై నామంతో బొట్లుపెట్టుకుని తలకు కొప్పువేసుకుని మాతంగి వేషంలో భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. తాతయ్యగుంట గంగమ్మజాతర ఉత్సవాల్గో శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు భక్తులు రకరకాల వేషాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.గంగమ్మకు ఉదయం అర్చకులు విశేష అభిషేకం చేసి అమ్మ వారిని మాతంగివేషంలో అలంకరించారు. తిరుపతి నగరం గంగమ్మజాతర సందడి నెలకొంది. ఉదయం తిరుపతి కమిషనర్ మౌర్య ఆలయంకు చేరుకుని భక్తులకు సౌకర్యాలు, క్యూలైన్ల నిర్వహణ, ఆలయంలో పరిశుభ్రతపై పరిశీలించారు. ఆలయంకు విచ్చేసిన భక్తులకు ఆలయ ఈఓ జయకుమార్ ప్రశాంతంగా దర్శనంచేసుకునేలా సిబ్బందిని పురమాయించారు. వైసిపి యువనేత భూమన అభినయ్‌రెడ్డి, టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు ఆలయానికి చేరుకుని గంగమ్మకు సారెను తీసుకువచ్చి సమర్పించారు.

# గంగ నీరు వచ్చేనా...రైతుల్లో బెంగ తీరేనా!


నాట్లుకు సిద్ధంగా నారు మడులు

చిట్టమూరు,మే 9 (ప్రభాతవార్త : తెలుగు గంగకాలువలు అన్నదాత ఇంట్లో సిరులు పండించి, సాగు, తాగునీరు అందించడంతో పాటు పంట దిగుబడికి దోహదపడుతుందన్న భావన ఉంది. అయితే చిట్టమూరు మండలంలో మాత్రం తెలుగు గంగ కాలువలో నీరు ప్రవహిస్తేచాలన్న వాదన నెలకొంది. సాగుకు సంసిద్ధమైన రైతాంగానికి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం తెలుగు గంగ నీరే ఆధారంగా ఉంటోంది. రైతాంగానికి అండగా ఉంటూ సాగునీరు అందిస్తామన్న పాలకులు, ప్రభుత్వం ప్రస్తుతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తుండడంతో సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. గంగ నీరుపై ఆశలు పెంచుకున్న రైతాంగానికి మండలంలోని ఆయా మేజర్ చెరువులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన తెలుగు గంగ కాలువలు నిరుపయోగంగా మారాయి. వ్యవసాయమే జీవనాధార మైన మెట్ట ప్రాంత రైతాంగం తెలుగుగంగ నీరుపై ఆశలు పెంచుకున్నాయి. కన్నులు కాయలు గాచేలా గంగనీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయి. పంట చివరి దశలో ఆఖరి తడి కోసం గంగనీరు తెచ్చేందుకు పోరాటమే చేయాల్సిన పరిస్థితులు యాటా నెలకొన్నాయి. చిట్టమూరు మండలంలో మేజర్ చేరువైన ఎల్లసిరి చెరువు కింద మెట్ట,మాగాణి రైతులు ఎడగారు వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే బోర్ల కింద రైతులు వరి నార్లు పూర్తి చేసుకుని యాతకు సిద్ధంగా ఉండగా మరోవైపు కేవలం చెరువు నీటి పైనే ఆధారపడి మరి కొంతమంది రైతులు ఈ ఏడాది కొత్తగా నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. ఏడాది ఎడగారిలో తెలుగు గంగనీరు చెరువుకు వస్తున్నాయన్న నాయకుల మాటలతో గత ఏడాది కంటే ఈ దఫా ఎడగారులో రైతులు మరింత ఎక్కువ విస్తీర్ణంలో వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. గత ఎడగారి కంటే ఈసారి ఎక్కువమంది సన్న, చిన్న కారు రైతులు వ్యవసాయాన్ని చేసుకొనేందుకు ముందుకొచ్చి దుక్కులు దున్నుకొని నార్లు సిద్ధం చేసుకున్నారు. ఎల్లసిరి రెవిన్యూ లోని ఎల్లసిరి అరవపాలెం, చింతల తోపు, పాటిమెట్ట, బయ్యవారి కండ్రిగ గ్రామాలకు ఎల్లసిరి చెరువుకు కంగనూరు వస్తే రైతుల పుష్కలంగా తమ పంటలను పండిం చుకునే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా తెలుగు గంగ నీటిని ఎల్లసిరి చెరువుకు తెచ్చేందుకు మండల బీసీ సెల్ అధ్యక్షులు కాపులూరు చెంచు రామాచారి స్థానిక శాసనసభ్యులు సునీల్‌కుమార్ సహకారంతో సంప్రదింపులు జరుపుతున్నారు. సోమ మంగళవారాల్లో గంగజాలాలు చెరువుకు చేరుతాయని రైతులు ఎలాంటి అధైర్య పడకుండా తమ తమ వ్యవసాయ పనులు చేసుకోవచ్చనని చెబుతున్నా, రైతుల మాత్రం గుబులు తగ్గడం లేదు. మరోవైపు చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని మరి కొంత మంది పట్టుబడుతుండగా గంగ నీరు ఎల్లసిరి చెరువుకు వచ్చేనా రైతులు బెంగ తీరేనా మన సందేహాలు మరికొన్ని రోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా ఈ ప్రాంత రైతులందరూ కాపులూరు మీదనే ఆశలు పెట్టుకొని గంగనీరు తేవాలని తమ పంటలు బాగా పండాలని కోరుతున్నారు.

# ఎట్టకేలకు కార్‌పార్కింగ్ టెండర్ ఖరారు

**-దేవాదాయశాఖ అంచనాల మేరకు బిడ్**



శ్రీకాళహస్తి,మే 9 (ప్రభాతవార్త : శ్రీకాళహస్తి కార్‌పార్కింగ్ టెండర్ ఎట్టకేలకు ఖారారు అయ్యింది. చాలా కాలంగా కార్‌పార్కింగ్ టెండర్ దేవాదాయశాఖ అంచనాల మేరకు బిడ్ రాలేదని సుమారు 8సార్లు వాయిదా వేసారు. ప్రస్తుత ఇఓ డి.బాపిరెడ్డి వచ్చిన తరువాత కూడా ఒకసారి టెండర్లనుపిలిచారు.కానీ దేవాదాయశాఖ ఆశించిన మొత్తం రాలేదని వాయిదా వేసారు. దాంతో మరో సారి టెండర్లను పిలవగా ఇద్దరు టెండర్లు వేసారు.యహిత అసోసియేట్స్ (జనసేన) తరపున ఒక టెండర్,ఎస్‌డి అసోసియేట్స్ (తెలుగుదేశం) తరపున మరో టెండర్ దాఖలైంది. అయితే ప్రతిసారి పోటీలు పడి టెండర్లు వేయటం తక్కువకు కోట్ చేయటం దేవాదాయశాఖ తిరస్కరించటం జరిగేది.అయితే ఈ సారి దేవాదాయశాఖ అంచనాల మేరకు దాదాపుగా టెండర్ వేయటంతో దాదాపుగా ఖరారైనట్లే అని తెలిసింది.

**దేవస్థానం ఆశించినంత ...**

గత మూడేళ్లుగా శ్రీకాళహస్తీశ్వరాలయం కార్‌పార్కింగ్ వసూళ్ళను నిర్వహిస్తున్నారు. ఏ ఏడాది కూడా రూ.2కోట్లు తగ్గటం లేదు. అయితే ఇందుకు దేవస్థానం 30మంది సిబ్బందిని నియమించింది. వారు వసూళ్లు చేస్తున్నారు. దాంతో ఆలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. టెండర్ ఖరారు అయితే దేవస్థానంకు సిబ్బంది మిగులుతుంది. జిఎస్‌టి చెల్లించాల్సిన పని లేదు. గతంలో జనసేన మద్దతు దారులు టెండర్లు దాఖలు చేయగా తమ అంచనాలకు తగ్గట్లురాలేదని రద్దు చేసారు. ఈ సారి కూడా జనసేనమద్దతు సంస్థ సుమారు రూ.1.55కోట్లకు టెండర్ దాఖలు చేయగా తెలుగుదేశం మద్దతుసంస్థ సుమారు రూ.1,59కోట్లుకు టెండర్ దాఖలు చేసారు. ఇరువర్గాలు రాజీపడ్డాయి. తలాకొంచెం పంచుకుందామని నిర్ణయానికి వచ్చారు. దాంతో టెండర్ దాదాపు ఖరారు అయినట్లే అని తెలిసింది.

**ఇఓ వివరణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహించిన కార్‌పార్కింగ్ టెండర్లకు సంబంధించి ప్రభుతవార్త ఇఓ డి.బాపిరెడ్డిని వివరణ కోరగా రెండు టెండర్లు వచ్చాయని అందులో ఒకటి రూ.1.59కోట్లు వచ్చాయన్నారు. తాము వసూలు చేస్తున్నా అంతే మొత్తం దేవస్థానంకు మిగులుతుందని అంతేకాక వసూళ్ళకు 30 సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.గతంలో రూ.కోటి, లలేదా కోటి 5లక్షలకు టెండర్లు దాఖలయ్యేవన్నారు. ఈసారి దేవాదాయశాఖ కమీషనర్ కార్యాలయం అంచనాలకు దాదాపుగా వచ్చింది కాబట్టి ఆమోదించబడుతుందన్నారు. కంపారిటివ్ స్టేట్ మెంట్ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నట్లు బాపిరెడ్డి వివరణ ఇచ్చారు.

## ఆలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

**-ఇకపై టిక్కెట్ లేకుండా నోఎంట్రీ- ఈఓ పెంచల కిషోర్**



కాణిపాకం, మే 9 (ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పనిచేసే సిబ్బంది అంకిత భావంతో పనిచేసి భక్తులకు సేవలందించాలని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ అన్నారు. శుక్రవారం స్థానిక దేవస్థానం ఆస్థాన మండపంలో దేవస్థానంలో పనిచేసే అన్ని విభాగాల అధిపతులు, అర్చకులు, వేదపండితుల, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో పనిచేసే అధికారులు, అర్చకులు, సిబ్బంది బాధ్యతాయుతంగా అంకితభావంతో పనిచేసి భక్తులకు సేవలందించాలన్నారు. ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, వారు సంతృప్తికంగా స్వామి వారిని దర్శించుకునే విధంగా సహకారం అందించాలని సూచించారు. ఆలయ అభివృద్ధి దృష్ట్యా దేవస్థానం ప్రోటోకాల్ వ్యక్తులు,ఆలయ ఉభయదారులు, ఆలయ సిబ్బంది వారి కుటుంబసభ్యులు మినహా మిగిలిన వారు ఎవరైనా సరే నిర్ణయించిన టిక్కెట్‌లను కొనుగోలు చేసిన వారిని మాత్రమే ఆలయ దర్శనానికి అనుమతించాలని ఆలయ సిబ్బందికి సూచించారు.ముఖ్యంగా ఆలయ సిబ్బంది తమకు కావలసిన వారు ఎవరైనా సరే తప్పని సరిగా టిక్కెట్ తీసుకుని ఆలయ దర్శనానికి తీసుకెళ్ళాలని ఆలయ ఈఓ పెంచల కిషోర్ సూచించారు. దర్శన విషయాలలో ఎలాంటి అవకతవక లను పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే దేవస్థానంకు వచ్చే భక్తులకు దేవస్థానం నందు కల్పించవలసిన సౌకర్యములు, భక్తులు, దాతల పట్ల సిబ్బంది ప్రవర్తించవలసిన విధివిధానాల గురించి వివరించారు. దేవస్థానంకు అదాయ వనరుల అభివృద్ధి పెంచుకునే మార్గాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనుంజయ, ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసుర అర్చకులు, వేదపండితుల, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రెన్యువల్‌కు మోకాలు వొడ్డుతున్న బ్యాంకర్లు

**- లబోదిబో మంటున్న రుణ లబ్ధిదారులు**

రొంపిచెర్ల, మే 9 (ప్రభాతవార్త: బంగారు రుణాల రెన్యువల్‌కు రొంపిచెర్ల భారతీయ స్టేట్ బ్యాంక్ అధికారులు మోకాలు వొడ్డుతున్నారని బంగారు రుణ లబ్ధిదారులు వాపోతున్నారు. రొంపిచెర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సుమారు 2000 మందికి పైగా బంగారు నగలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. సంవత్సరం లోపలే వడ్డీ కడితే తక్కువ వడ్డీ పడుతుందని రైతులు తీసుకున్న బంగారు రుణాలను ప్రతి ఏడాది వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేసేవారు. అయితే ఈ ఏడాది స్టేట్ బ్యాంక్‌లో అధికారులు బంగారు రుణాలు తీసుకున్న లబ్ధిదారులు అసలు, వడ్డీ పూర్తి చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని మొండికేశారు. దీంతో బంగారు రుణాలు తీసుకొని వ్యవసాయ పంటలు దోస, టమోటా పంటలు సాగు చేసిన రైతులకు 80శాతం నష్టాలు వచ్చాయి. ఈ దశలో పూర్తిగా రుణాలు చెల్లించాలని డిమాండ్ చేయడం బ్యాంకర్లకు తగదని రైతులు తెలిపారు. ఇతర బ్యాంకులలో వడ్డీ చెల్లిస్తే బంగారు రుణాలు రెన్యువల్ చేస్తున్నారని తెలిపారు. ఒక ఎస్ బి ఐ లో మాత్రమే అధికారులు లబ్ధిదారులు వేధిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని బంగారు రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**- బంగారు రుణాలపై మా ప్రమేయం లేదు: బ్యాంకు మేనేజర్**

బంగారు రుణాలకు సంబంధించి మా ప్రమేయం ఏమీ లేదు. పై అధికారులకు తెలియచేస్తాం. బంగారు రుణాలు పొందిన ఖాతాదారులు రాతపూర్వకంగా బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేయాలని కోరారు. దీనిపై మేము కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు.

# మరింత 'హై అలర్ట్'!

**తిరుమల, తిరుపతిలో భద్రత పెంపు**





తిరుమలలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు



తిరుమల,మే 9 (ప్రభాతవార్త)ప్రతినిధి: భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి నగరంలో భద్రతను మరింత పెంచారు. తిరుమల ఆలయంతోబాటు ఇక్కడకు వస్తున్న యాత్రికుల భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.శుక్రవారం మధ్యాహ్నం తిరుమలలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో టిటిడి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ అధికారులు, ఆక్టోపస్ అధికారులు అత్యవసరంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమల ఆలయంతో బాటు తిరుమల అంతటా పూర్తిస్థాయిలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, వస్తున్న ప్రతి యాత్రికునిపై మరింత నిఘాఉంచాలని ఆదేశించారు. ఆలయం పరిసరాల్లో అదనపు భద్రత బలగాలను మొహరింపజేశారు. ఉద్రిక్తతలతో తిరుమలను అప్రమత్తంచేసిన పోలీసు ఉన్నతాధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులు, టిటిడి విజిలెన్స్ అధికారులు శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తుల వాహనాలను, చివరకు ఆర్టీసి బస్సులను వాటిలోని సామాగ్రిని,భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శ్రీవారి ఆలయం నలువైపులా, ఆలయానికి ఎదురుగా ఉన్న గొల్లమండపంపైన ఏపిఎస్‌పి ,ఏఆర్ పోలీసులను మరింత అప్రమత్తం చేసి అలర్ట్‌గా ఉండాలని ఎప్పటికప్పుడు వాకీటాకీల ద్వారా హెచ్చరిస్తున్నారు.

తిరుమలకు ప్రదాన ప్రవేశద్వారం అలిపిరి తనిఖీ కేంద్రంతోబాటు తిరుమల రెండు, మొదటి ఘాట్‌రోడ్లులో పలు చోట్ల, లింకురోడ్డు వద్ద తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో అడిషనల్ ఎస్పీలు రవిమనోహరచారి. వెంకట్రావు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయ శేఖర్, టిటిడి విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్రల పర్యవేక్షణలో పోలీసులు నిశితంగా భక్తులను తనిఖీ చేస్తున్నారు. ఆక్టోపస్ బలగాలు, పోలీసులు ఒక్కసారిగా రోడ్లపైకి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఆలయం పరిసరాల్లో పూర్తిగా ఆక్టోపస్ బలగాలు మొహరించాయి.

## రేషన్ కార్డుకు దరఖాస్తులు చేసుకోండి

**సదుం, మే 9 ప్రభాతవార్త :** మండలంలో అర్హులైన వారి నుంచి నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు శుక్రవారం తెలిపారు. నూతన సభ్యుల చేర్పు, విభజన, పేర్ల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ దిద్దు బాటు తదితర వాటికి స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 7 రకాల సేవలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కావమ్మ, మారయ్య తిరునాళ ప్రారంభం



**సదుం, మే 9 ప్రభాతవార్త :** మండలంలోని భట్టు వారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరునాళ వైభవంగా ప్రారంభం అయ్యింది. సదుం బెస్త సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు, ఆరాధన, పూజలు చేశారు. భక్తులు మేళతాళాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తుల కోసం జంగాల కథ వివరించారు. భక్తులకు అన్నదానం చేశారు. శనివారంకల్యాణోత్సవం, సారె పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

## వరసిద్ధుని దర్శించుకున్న రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే

**కాణిపాకం, మే 9 ప్రభాతవార్త:**



రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు),ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిలు శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచట కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజి నాయుడులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సోమల్లో వీధి కుక్కల వీరంగం



**సోమల, మే 9 ప్రభాతవార్త :**

సోమల సచివాలయం సమీపంలోని చికెన్ సెంటర్ వద్ద వీధి కుక్కలు వీరంగం సృష్టించడంతో పలువురు గాయాలు పాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. రాంపల్లికు చెందిన గంగాధర్ ద్విచక్ర వాహనంలో సోమల బస్టాండ్లకు వస్తుండగా వీధి కుక్కలు వెంబడించి మరి గాయపరిచాయి. దాదాపు 5 మంది గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వీరు పలు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు పొందినట్టు తెలిసింది. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేసుకోవాలి

**రొంపిచెర్ల, మే 9 ప్రభాతవార్త:**



గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వినయ్ తెలిపారు. శుక్రవారం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు గుండె, బీపీ, షుగర్ ఉదర, రక్త పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకోవడం తల్లి, బిడ్డకు సురక్షితమని అన్నారు. మాతా, శిశు మరణాలు నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షం ధాటికి కూలిన ఇంటిపైకప్పు బాలికకు తీవ్రగాయాలు.



**పెద్దపంజాణి మే9 ప్రభాతవార్త:** మండలంలోని చిన్నేపల్లి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీవర్షానికి గ్రామంలో నివాసముంటున్న అఫ్రోజ్ అనేవ్యక్తి ఇంటి పైకప్పు కూలిపడింది. దీంతో ఇంట్లో ఉన్న అతని కుమార్తెలకు బలమైన గాయం తగిలింది. దీంతో వెంటనే వాళ్ళని చికిత్సనిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండటంతో వైద్యులు వారిని చిత్తూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

## సింగల్‌విండో సిఈఓగా రామరాజు



**పెద్దపంజాణి, మే9 ప్రభాతవార్త:** పెద్దపంజాణి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఈఓగా రామరాజు శుక్రవారం బాధ్యలు చేపట్టారు. ఇక్కడ సిఈఓగా పనిచేసిన చంద్రశేఖర్ రామసముద్రంకు బదిలీ అయ్యారు. సహకార సంఘం అభివృద్ధికి స్థానిక నేతలు, సంఘసభ్యులు,రైతులు సహకరించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో రమేష్,రెడ్డెప్ప పాల్గొన్నారు.

## చిన్న శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు

**సదుం, మే 9 ప్రభాతవార్త :**

మండల పరిధిలోబూరగ మంద గ్రామంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారని చిన్న శేష వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి అనంతరం తిరుచ్చి వాహనంపై గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉబయదారులుగా మాజీ విఆర్ఓ అన్నారెడ్డి వ్యవహరించగా మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ప్రభాకర్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. సదుం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎగువవీధిలో తల్లికి వందనం కార్యక్రమం



**శ్రీకాళహస్తిరూరల్, మే 9 ప్రభాతవార్త:** మండలంలోని ఎగువవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్, సిడిపిఓ శాంతిదుర్గ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్కూల్ పిల్లలో వారి తల్లులకు పాదాలు కడిగి నమస్కరించి పాదపూజ చేయించడం జరిగింది. అలాగే తల్లులకు పిల్లలకు పోషకాలు ఉన్న ఆహారాలు ఇవ్వాలని పరిశుభ్రత, ఫోన్‌కు దూరంగా మంచి అలవాట్లు నేర్చుకునేలా పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేవతి, ఎంఎస్‌కె మాధవి, అంగన్‌వాడీ కార్యకర్త వాణి, సుమలత, ఆశా, గ్రామస్తులు హజరయ్యారు.

## గంగమ్మను దర్శించుకున్న ప్రభుత్వవిప్, కలెక్టర్



**కుప్పం, మే 9 ప్రభాతవార్త:** గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ అమ్మ వారిని శుక్రవారం ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూగర్భజలాల పెంపుకు చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్



**కుప్పం, మే 9 ప్రభాతవార్త:** గుడుపల్లె మండలంలో భూగర్భజలాల పెంపుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి గుడుపల్లె మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా గుడుపల్లె పిహెచ్‌సిని సైతం సందర్శించారు. అక్కడే గ్రామీణనీటిపారుదల శాఖ అధికారులు, ఎంపిడిఒ, స్థానిక నేతలతో కలసి సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుడుపల్లె మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులు సద్వినియోగం చేసుకుని అవసరమైన చోట్ల బోర్ల ఏర్పాటుకు గల అవకాశాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భజలాల నీటిమట్టంకు సంబంధించి గుడుపల్లె మండలం చివరి స్థానంలో ఉందన్నారు. శాశ్వత పరిష్కారం కోసం ఉపాధిహామీ పథకంలో చెరువులు బలోపేతం చేయడం, పూడికతీత, చెరువుల అనుసంధానం పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ, ఇరిగేషన్ అధికారులు, ఎపిఒలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో డ్రైన్ల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా చెరువులను నీటితో నింపే విషయం పరిశీలించాలని రైతులు కోరగా సంబంధిత అధికారులతో చర్చిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పురుషోత్తం, ఎంపిడిఒ రాధాకృష్ణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కాళికాంబ అమ్మవారి జాతర



**కుప్పంరూరల్, మే 9 ప్రభాతవార్త :** మండలంలోని కంగుంది గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న కాళికాంబ అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలోని అన్ని ఆలయాల్లో పూజలు, అభిషేకం, పండరి భజన, అన్నదానం, అమ్మవారి ఆలయం వద్ద పసుపు,కుంకుమ, వస్త్రాల పంపిణీ, గుర్రంపై అమ్మవారి విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్టీసీవైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సర్పంచ్ ధనశేఖర్, ఉప సర్పంచ్ తిరుపతి, స్థానిక నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కుప్పం/శాంతిపురం, మే 9 ప్రభాతవార్త :**

విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మత్తుల కారణంగా శనివారం కుప్పం, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిఇలు ప్రభాకర్, హిమ్మత్‌సాగర్ తెలిపారు. కుప్పం మండలంలో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2దాకా, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## గౌరవసభ విజయవంతం చేయాలి



**సదుం, మే 9 ప్రభాతవార్త :** ఈనెల 11న తిరుపతిలో జరిగే మాలల ఆత్మీయ గౌరవ సభను పార్టీలకతీతంగా అందరూ కలిసి వచ్చి విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ వెంకటస్వామి కోరారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలల యూనిటీ మరియు సెల్ఫ్ రెస్పెక్ట్ కొరకు అందరు కలిసి రావాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచి ఉషారాణి, సదం మండలం ఎస్సీ సెల్ నాయకులు శ్రీరాములు, చెన్నకేశవులు, శ్రీనివాసులు, వెంకటనారాయణ, రామచంద్రయ్య, ఆర్‌వి రమణ, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమికులకు కౌన్సిలింగ్... తల్లిదండ్రులకు అప్పగింత

**పుంగనూరు, మే 9 ప్రభాతవార్త :** మండలంలోని కురపల్లి గోపిశెట్టి పల్లెలకు చెందిన ఇద్దరు ప్రేమికులకు



విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు కౌన్సిలింగ్ ఇచ్చి వారిండ్లకు పంపారు. కురప్పల్లెకు చెందిన అబ్బాయి, గోపిశెట్టిపల్లికు చెందిన అమ్మాయి డిగ్రీచదువుతున్నారు. వీరిద్దరు ప్రేమించుకుని ఇల్లు వదిలి వెళ్ళిపోయారు. వారి తల్లిదండ్రులు తెలుగుదేశం నాయకులు, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబును సంప్రదించగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇరు వర్గాల పెద్దలను పిలిపించి మాట్లాడిన తర్వాత సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వివాహానికి ముందుగా బుక్ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశం నాయకులు దేశాది శ్రీనివాసులు ఆర్యవైశ్య నాయకుడు రవి కుమార్ శెట్టి, గోపిశెట్టిపల్లి తెలుగుదేశం నాయకులు శ్రీనివాసులు వెంకటస్వామి వాసుదేవ నరసింహులు పెద్దలు సుబ్రహ్మణ్యం, హరి నారాయణ, అమ్మి గాని పల్లి మునికృష్ణ, రమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి 2.73 లక్షలు విరాళం



**కాణిపాకం, మే 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు భక్తులు శుక్రవారం వేర్వేరుగా 2.73 లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్ కు చెందిన ఎస్.బాలాజి వెంకటేశ్వర్లు అనే భక్తుడు శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,11,116 రూపాయలు భక్తులు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 62వేల రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ, ఉమాదేవి దంపతులు శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 50,116 రూపాయలు భక్తులు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 50,116 రూపాయలను విరాళంగా అందించారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజా సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించండి



**చిత్తూరురూరల్, మే 9 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి అప్పటికప్పుడు పరిష్కార దిశగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలతో విచ్చేసిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకొని వారి వినతులను స్వీకరించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్‌శాఖకు సంబంధించి పారిశుధ్యం, వీధిదీపాలు, ఇతర సమస్యలను రెండురోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే రెవిన్యూ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనరు నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, నగరపాలక, రెవిన్యూ, ఇతరశాఖల అధికారులు, డివిజన్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరసన

**పుంగనూరు రూరల్, మే 9 ప్రభాతవార్త:**



జర్నలిస్టులపై పోలీసులు సోదాలు చేయడానికి నిరసిస్తూ ఏపీడబ్ల్యూజెఎఫ్.జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ సైపుల్లు, పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షులు సాల్వరాజు సతీష్ కుమార్, లీగల్ అడ్వాజర్ తల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుంగనూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులందరితో కలసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ రాముకి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ పుంగనూరు నియోజకవర్గ శాఖ కమిటీ జగదీష్,ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, రెడ్డెప్ప, చిత్తూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా బ్రాడ్ కార్యదర్శి జావీద్, సహాయ కార్యదర్శి బాబు,సభ్యులు రసూల్, పురుషోత్తం, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## కుంభాబిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**చిత్తూరురూరల్, మే 9 ప్రభాతవార్త:** చిత్తూరు రూరల్ మండలం ఆలుకూరపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిరం మహాకుంభాభిషేక ఉత్సవాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పరిసం గ్రామస్తులు, నాయకులు ఘనంగా సత్కరించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, తెదేపా నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, నీలకంఠనాయుడు, సుబ్బానాయుడు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## కిషోరి వికాసంపై అవగాహన



**కల్లూరు, మే 9 ప్రభాతవార్త:** మండలం కల్లూరు పంచాయతీ పుంగనూరు రోడ్డు లోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సిడిపిఒ మల్లీశ్వరి ఆధ్వర్యంలో కిషోరి వికాసం పై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు వలన జరిగే నష్టాలు. పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహాలు చేయడం వలన కట్టపరంగా తీసుకునే చర్యల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయలక్ష్మి, మహిళా పోలీస్ చరిణ, ఏఎన్ఎం సరస్వతి, అంగనవాడి కార్యకర్తలు ధనలక్ష్మి, అమృత, శారద, శ్యామల, సంఘమిత్ర, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## మృత్యుంజయేశ్వరస్వామి రథోత్సవం

**చౌడేపల్లి, మే 9 ప్రభాతవార్త:** స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవం భక్తులను అలరించింది. స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వాహన ఉత్సవాల్లో రథోత్సవానికి ప్రాముఖ్యత వుంది. బలిజసంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, అలంకరణగావించారు. ఆలయం వద్ద కడియాల మురళి, శివకుమార్, నానబాల గణేష్, పవన్‌రాయల్‌లచే ఉచిత అన్నదాన శిబిరాలు, చల్లని పానీయాల కేంద్రాలు నిర్వహించారు. పట్టణంలోని బలిజ సంఘ, వినాయక యువజన సేవా సంఘ నాయకులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనింది.



## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**చౌడేపల్లి, మే 9 ప్రభాతవార్త:** గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... చౌడేపల్లి పరిధిలోని గడ్డంవారిపల్లి మార్గంలో గల యానాదిపాళెంకు చెందిన ఇరువారం రెడ్డెప్ప(31)మామిడి తోటల్లో కాపలా పనిచేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో చిన్నయల్లకుంట్ల వద్ద ఓ మామిడితోటకు కాపలా వున్నాడు. దీంతో గురువారం రాత్రి చౌడేపల్లి నుంచి మామిడితోటకు కాలినడకన వెళుతుండగా మార్గ మధ్యంలో చిగరమానుకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రెడ్డెప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి పంపించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## యుద్ధ అమరవీరుడు మురళికి ఘన నివాళి



**చౌడేపల్లి, మే 9 ప్రభాతవార్త:** ఇటీవల జమ్మూ-కాశ్మీర్ లోని యుద్ధ క్షేత్రంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళులర్పించారు. వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్ ఆధ్వర్యంలో స్థానికంగా సంతాపసభ జరిగింది. దేశం కోసం ప్రాణాలను త్యజించిన సత్యసాయి జిల్లా జవాను మురళీ నాయక్ కుటుంబానికి సానుభూతిని సంతా పాన్ని వ్యక్తం చేసారు. మృతవీరుని కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విదాలా అండగా వుండాలని విజ్ఞప్తి చేసారు. వైకాపా, విద్యార్థి విభాగ నాయకులు పాల్గొన్నారు.

## సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు



కేవీబీ పురం, మే 9 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని తిమ్మసముద్రం సచివాలయాన్ని ఎంపీడీవో వి.బి.మాలతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను సిస్టం పనితీరును పరిశీలించారు. అనంతరం సిబ్బంది సమయపాలన పాటించాలని అదే విధంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. 15 రకాల సర్వే నిర్వహణకుప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రస్తుతం 12 రకాల సర్వేలు మండలంలో కొనసాగుతూ ఉంటుండగా 19 సచివాలయాలపరిధికి సంబంధించి సర్వే నిర్వహణను పూర్తి చేయాలన్నారు. ప్రత్యేకించి వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఉత్పన్నమవ్వకుండా చూడాలన్నారు.

## పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటాం



**కేవీబీ పురం, మే 9 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలో ఉన్న ఆదర్శ పాఠశాల, కాలేజీ అభివృద్ధికి సహకరించాలని ఏపీ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ని ఏపీ మోడల్ స్కూలు ఛైర్మన్ అవసరం సురేష్‌రెడ్డి కోరారు. వెంటనే స్పందించి త్వరలో నిధులు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఫోన్‌లో ఉన్న ఆదర్శ పాఠశాల మైదానంను చూపించి పాఠశాల సమస్యలను మంత్రికి తెలియజేసినట్లు తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే ప్రణాళిక తీసుకుని వచ్చి అభివృద్ధి చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు.

## వైభవంగా భిక్షాటన ఉత్సవం



**పుత్తూరు రూరల్, మే 9 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం భిక్షాటన ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని కామాక్షి దేవికి శ్రీ సదాశివేశ్వర స్వామికి అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## తొట్టంబేడు ఏఓగా రవీంద్రనాథ్



**తొట్టంబేడు, మే 9 ప్రభాతవార్త :** తొట్టంబేడు ఏఓగా టి.రవీంద్రనాథ్ నియమితులయ్యారు. చిత్తూరు జడ్పిలో పనిచేస్తున్న ఆయన్ను తొట్టంబేడు ఇన్‌ఛార్జి ఏఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న మధుసూధన్ గతనెలలో పదవీవిరమణ పొందిన విషయం విదితమే. గతంలో రవీంద్రనాథ్ సీనియర్ అసిస్టెంట్‌గా తొట్టంబేడులో పనిచేసిన అనుభవం ఉంది. దీంతో ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

## మంత్రికి ధన్యవాదాలు తెలిపిన మీసేవ నిర్వాహకులు



**శ్రీకాళహస్తి, మే 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారాలోకేష్‌కు మీసేవ నిర్వాహకులు సత్యవేడు పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయన గురువారం ఏపిసీడ్స్ కూడలి వద్ద తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తిరుపతి జిల్లా మీసేవ అసోసియేషన్ వెంటనే స్పందించి మీసేవ ప్రజలకు సేవ చేయడానికి మంచి అవకాశం ఉందని ప్రభుత్వంకు ప్రజలకు వారధిగా ఉండి ప్రజలకు సేవలందించండని మీసేవ నిర్వాహకులకు సూచించారు. ముందు ముందు సచివాలయంలో ఉన్న అన్ని సేవలు మీసేవకు అందిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రికి మరియు ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సూర్యకుమార్, మరియు మీసేవ సభ్యులు కిరణ్, శ్రావణ్, తేజ, గుణ, గురవయ్య ఉదయ్, పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను కలిసిన గ్రామ సహాయకులు

**తొట్టంబేడు, మే 9 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రుణపడి ఉంటామని గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి యామల లక్ష్మణ్ అన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో విఆర్ఏ నుంచి అటెండర్, వాచ్మెన్ పదోన్నతుల విషయంలో సహాయసహకారాలు అందించిన చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు రుణపడి ఉంటామని పదోన్నతి పొందిన విఆర్ఏ మిత్రులతో కలసి కలెక్టర్‌ను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. చిత్తూరు విఆర్ఏ జిల్లా అధ్యక్షులు కోదండన్, దేవరాజ్, వినాయక మరియు పలమనేరు డివిజన్ నాయకులు వాసు, మునికుమార్, కృష్ణమూర్తి, అమర, వెంకటరమణ, గురుమూర్తి, తిరుపతి జిల్లా అధ్యక్షులు సాంబయ్య, అంకయ్య, బాబు, నాగరాజు, అన్నమయ్య జిల్లా నాయకులు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా విఆర్ఓ అసోసియేషన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు వందేమాతరం అని నినదించడండి



**తొట్టంబేడు, మే 9 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు వందేమాతరం అని నినదించడండని తెలుగుదేశంపార్టీ బిసి నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు మాట్లాడుతూ భారతదేశ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్న పొరుగు దేశమైన పాకిస్తాన్ కుట్రలను అడ్డుకోవడానికి అందరు కలసికట్టుగా భారత ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అందులో భాగంగానే ప్రతి ఒక్క భారతీయుడు వందేమాతరమంటూ నినదించాలని తెలుగుదేశంపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా.దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, మిన్నల్‌రవి, గాలిమురళీనాయుడు, రావిళ్ళ మురళీనారయుడు డా.నివేదిత మోరే, నాగమల్లిదుర్గాప్రసాద్, డా.యం. ఉమేష్‌రావు, పేటబాలాజీరెడ్డి, కాసరం రమేష్, వజ్రంకిషోర్, దొరైరాజ్‌రెడ్డి, మునిరాజయాదవ్, డివినారాయణ, కోటచంద్రశేఖర్, కెవి.ప్రతాప్, మురళీ, మహబూబ్‌బాషా, యంయస్‌రెడ్డి నాగరాజు, భాస్కర్ మణికంఠ, ఆనంద్‌గౌడ్, రమేష్, సతీష్,కిరణ్, వినోద్, వెంకటస్వామి, సురేష్, లోకేష్, నూర్ మహ్మద్, చాంద్‌బాషా, ముజీబ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాసరం పుట్టినరోజు వేడుకలు



**శ్రీకాళహస్తి, మే 9 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ,తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు, మరియు మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్‌చాంద్ బాషాల పుట్టినరోజు వేడుకలు స్థానిక జయరాంరావువీధిలోని తెలుగుదేశంపార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాసరం రమేష్ కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీచేశారు. అనంతరం వీరిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో ఘనంగా సుజన 2కె25 సదస్సు




కోట, మే 9 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో సుజన 2కె25 జాతీయ స్థాయి సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, హెచ్‌ఓడి డాక్టర్ చింతా రవీంద్రారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదువుకుంటే మంచి ఫలితాలు పొంద వచ్చన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి సదస్సులను తమ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతగానో ప్రోత్సహిస్తు న్నారని తెలిపారు. అనంతరం సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ చింత రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో కల్పించే సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం అన్ని విభాగాల వారు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం కన్వీనర్ రాధాకృష్ణ మాట్లాడారు. ఈ పోటీల్లో గణితానికి డాక్టర్ పి.విజయజ్యోతి, రసాయన శాస్త్రానికి డాక్టర్ కామేశ్వరరావు, భౌతిక శాస్త్రానికి వై.మాధవ్‌కుమార్, ఆంగ్లం విభాగానికి డాక్టర్ ఎస్.పీటర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సదస్సులో 150 పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కన్వీనర్ రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న రెవిన్యూ విఆర్‌ఓ

**- నా రేటే సపరేటు అంటున్న విఆర్‌ఓ**
**- మహిళ గురవమ్మ ఆవేదన**



గూడూరు, మే 9 ప్రభాతవార్త : ప్రభుత్వాలు మారిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగుల పనితీరు ఏ మాత్రం మారడం లేదు.. కబ్జాదారులకు రెవెన్యూ అధికారి విఆర్‌ఓ కొమ్ముకాస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వద్ద తమ ఇంటి స్థలాన్ని కబ్జాదారులు కబ్జా చేశారని పలుమార్లు రెవిన్యూ అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గూడూరు అరుంధతి పాలెం కు చెందిన గురవమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసారు. గత ఆరు నెలలుగా తహసిల్దార్ ఆఫీస్ చుట్టూ తమకు న్యాయం చేయాలని తిరుగుతున్నా.. సంబంధిత ఎంఆర్‌ఓ వెంటనే సమస్యను పరిష్కరించమని విఆర్‌ఓకు ఆదేశాలు జారీ చేసిన పట్టించుకోలేదని వాపోయారు. ప్రభుత్వం తనకు ఇచ్చినటువంటి ఒరిజినల్ పట్టా పాసు పుస్తకం తన దగ్గర ఉన్న కూడా చూసి చూడనట్టు విఆర్‌ఓ వ్యవహరిస్తున్నారు. బాధితురాలు 30,000 రూపాయలు ఇస్తేనే తనకి న్యాయం చేస్తానని విఆర్‌ఓ తెలిపారన్నారు. లేకపోతే నీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమని హెచ్చరిస్తున్నారని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఇకనైనా ఇటువంటి లంచాలు తీసుకునే అధికారులను సంబంధిత ఉన్నత అధికారులు వెంటనే విధులు నుండి తొలగించి తనకు న్యాయం చేయాలని అరుంధతీపాలెంకు చెందిన గురవమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేదురుమల్లి కుటుంబం వల్లే నియోజకవర్గ అభివృద్ధి



వెంకటగిరి, మే 9 ప్రభాతవార్త : నియోజకవర్గం నేదురుమల్లి కుటుంబం వల్లే అభివృద్ధి చెందిందని వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా వెంకటగిరి లోని ఎన్‌జెఆర్ భవనంలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. జనార్ధన్‌రెడ్డి సీఎంగా ఉన్న రెండు సంవత్సరాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క వెంకటేశ్వరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి మండల కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు కళ్యాణి, వహీదా, శ్రీనివాసులు, శంకరయ్య, ఎంఎన్ నారాయణ, నాయకులు నాగయ్య, దశరథి రామిరెడ్డి, సతీష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

## నేదురుమల్లికి ఘన నివాళులు



వాకాడు, మే 9 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 11 వర్ధంతి సందర్భంగా నేదురుమల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ నివాళులు అర్పించిన వారిలో నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్, నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, వాకాడు ఉపసర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, షనీల్ రెడ్డి, నాగూర్ రెడ్డి, హిమ కుమార్ రెడ్డి, శశి ధర్ రెడ్డి, మాజీ ఎంపిపి దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకట రత్నం, అభిమానులు పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు.

## ప్రభుత్వ ఆసుపత్రులకు మహర్ధశ : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 9 ప్రభాతవార్త : ప్రభుత్వ ఆస్పత్రులకు కూటమి ప్రభుత్వంలో మహర్ధశ వచ్చిందని ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. గత వైసిపి ప్రభుత్వాలు ఆసుపత్రులలో మందులు కూడా ఉండేవి కాదని తెలిపారు. వైద్య వ్యవస్థను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. పేదల కోసం గుండెపోటు వచ్చిన వారికి ఉచితంగా 40వేల రూపాయల ఇంజక్షన్ కూడా ఆసుపత్రిలో అందుబాటులో వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఆస్పత్రిలో ఉన్న డాక్టర్ల కొరతను త్వరలో తీరుస్తామని తెలిపారు. త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, నాయకులు దంతు బాలకృష్ణ, ఆనంద్ తదితరులు ఉన్నారు

## భారత సైనికులకు సెల్యూట్ : నేదురుమల్లి



వాకాడు, మే 9 ప్రభాతవార్త: పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన భారత సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ మాజీ చైర్మన్, వెంకటగిరి నియోజవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వాకాడు లోని నేదురుమల్లి నివాసంలో 11వ వర్ధంతి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి రాంకుమార్‌రెడ్డి కుటుంబీకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు వాకాడు గ్రామం నుండి భారతదేశ చరిత్రలో పేరు ప్రఖ్యాతులు పేరుగాంచారన్నారు. మా తండ్రి జనార్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్మరించుకోవడం బాధ్యతగా ఉండాలని, ఆయన చేసిన ఆశయాలతో పాటు మిగిలిన ఆశయాన్ని కొనసాగిస్తానని ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి మాట ఇస్తున్నానని భరోసా ఇచ్చారు.

## 50శాతం సబ్సిడీతో ఎస్సీ,ఎస్టీ రైతులకు పశువుల దాణా

వెంకటగిరి, మే 9 ప్రభాతవార్త: ఎస్సీ,ఎస్టీ పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువులదాణా పంపిణీ చేస్తున్నట్లు వెంకటగిరి పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ స్వామిబాబు తెలిపారు. 50 కేజీల పశువుల దాణా 555 ఇస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, డక్కిలి మండలాల్లోని పాడి రైతులు స్థానికంగా ఉన్న పశు వైద్య ఆస్పత్రిలో తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రేషన్ కార్డులు మంజూరుకు శ్రీకారం



చిట్టమూరు,మే 9 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు మంజూరుకు ఎదురుచూపులు చూసిన వినియోగదారులకు ప్రస్తుత కూటమి సర్కార్ తీపి కబురు అందించడంతో ఆయా సచివాలయాలు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7వ తేదీ నుండి కొత్త రేషన్ కార్డులు మంజూరుకు ప్రభుత్వం నుండి అనుమతులు లభించడంతో ఇప్పటివరకు రేషన్ కార్డులు మంజూరు కానీ వారితో పాటు రేషన్ కార్డుల్లో చేర్పులు,మార్పులు చేసుకోవచ్చును. శుక్రవారం అరవపాలెం సచివాలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు రేషన్ కార్డులు మంజూరు కొరకు చింతలతోపు,ఎల్లసిరి, అరవపాలెం, దరఖాస్తు, బయ్యావారికండ్రిగ గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు.

## జన విజ్ఞాన వేదికచే గర్భిణీ స్త్రీలకు ఆహార వితరణ



గూడూరు, మే 9 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వి.కె. షోరూమ్ అధినేత మల్లికార్జున దాతృత్వంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద గర్భిణీ స్త్రీలకు వెజిటబుల్ రైస్, గుడ్డు, అరటి పండు, వాటర్ బాటిల్స్‌ను ముఖ్య అతిధులు డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ వి.కే. షోరూం అధినేత మల్లికార్జునని అభినందించారు. జన విజ్ఞాన వేదిక నిత్యం మంచి సమాజం కోసం పోరాడుతూ మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని జే.వి.వి సభ్యులు అన్నారు. జెవివి సభ్యులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, ప్రభాకర్, సుబ్బారావు, ఆనంద్, సుబ్రహ్మణ్యం, టీచర్ రాదయ్య, ఇబ్రహీం, రజినికాంత్, సుమన్ రెడ్డి, వెంకట్, శ్రీనివాసాచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మాతమ్మ అమ్మవారి కొలుపు మహోత్సవం



చిల్లకూరు, మే 9 ప్రభాతవార్త : గ్రామంలోని అరుంధతివాడలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ మాతమ్మ అమ్మవారి దేవస్థానంలో కొలుపు మహోత్సవ కార్యమాలు ఈ నెల 7నుండి 11వ తేదీ వరకు వైభవంగా జరగ నున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కొత్త రేషన్ కార్డులు కొరకు దరఖాస్తు చేసుకోండి

పెళ్లకూరు మే 9 ప్రభాతవార్త : కొత్త రేషన్ కార్డులు కొరకు మండలంలోని ఉన్న అన్ని గ్రామాలలోని సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ ద్వారకా నాథరెడ్డి కోరారు. పెళ్లకూరు తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని, చేర్పులు తొలగింపులు తదితర సేవలను కూడా వినియోగించుకోవాలని కోరారు అర్హులైన పేదలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలుతో నమోదు చేసుకోవాలని కోరారు

## కార్యకర్తలను ఇబ్బందిపెడితే వదలిపెట్టను! : బియ్యపు



తొట్టంబేడు,మే 9 ప్రభాతవార్త : అందరూ గుర్తున్నారు, అన్ని గుర్తున్నాయి ఏదీ మర్చిపోను అంటూ మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా తొట్టంబేడు మండల నాయకులు హాజర య్యారు. మధు సూధనరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి వైకాపా కుటుంబ సభ్యులను అన్యాయంగా ఇబ్బంది పెడుతున్న అధికారులను వదలిపెట్టేది లేదని స్పష్టం చేసారు. పేదల పక్షాన నిలుస్తున్న తనపై తెలుగుదేశం నాయకులు అన్యాయంగా కేసులు పెడుతున్నారు. అంతేకాక తన అనచరులపై తన మద్దతు దారులను ముప్పు తిప్పలు పెడుతున్నారు.అన్యాయంగా పోలీసు కేసులు బానాయించి మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది మంచిసంప్రదాయంకాదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అయితే తెలుగుదేశం పార్టీ పెట్టే కేసులకు భయపడము. ధైర్యంగా ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేసారు.

**తొట్టంబేడు నాయకులతో సమావేశం:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలవైకాపా నాయకులతో మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సమావేశం ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు హాజర య్యారు. ఈ సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి మధుసూధనరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి 2019వరకు ఎన్నికల వరకే రాజకీయం, ప్రత్యర్థులుగా చూసామని కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు.తాము అధికారంలో ఉన్నపుడు ఎందరో తెలుగుదేశం వారు సహాయాలు పొందారన్నారు. తాము ఎవరు సహాయం కోసం వచ్చినా పార్టీలతో ప్రమేయం లేకుండా అప్పన్న హస్తం అందించామన్నారు. శ్రీకాళహస్తి చరిత్రలో లేని విధంగా నేడు తెలుగుదేశం కొత్త సంప్రదాయానికి తెరలేపిందన్నారు. నిరుపేదలు ఎక్కడ కూలి చేసుకుంటుంటే చిరుద్యోగం చేసుకుంటుంటే వారిజీవితాలతో ఆటలాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న దౌర్జన్యాలు దాడులకు సంబంధించి పార్టీ అధినేత జగనన్నకు వివరించామన్నారు. ఈసమావేశంలో తొట్టంబేడు మండలానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

# అందరికి అందాలు...నేతన్నకు ఆకలి దప్పులు

**అందరికి అందాలు అందించే చేనేత కార్మికుల బతుకులు ఛిద్రమైపోతున్నాయి.' శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం కళలు,కళాకారులు,చేతివృత్తుల వారికి నిలయం.శ్రీకాళహస్తిలో నేతన్నలు నివాసముంటు న్నారు. పట్టణ నడిబొడ్డులోని సాలిపేట,భాస్కరపేటల్లో వేలాది మంది నివాసముంటున్నారు. అయితే వారి వెతలు వర్ణనాతీతంగా ఉంది.ఏ ప్రభుత్వం వచ్చినా చేనేత కార్మికులకు అరచేతిలో స్వర్గం చూపటమే తప్ప ఆదుకునే దిక్కులేదు. ఇక్కడ నుంచి నాయకులు పదవులు అనుభవిస్తున్నా కార్మికుల రాతలు మాత్రం మారటం లేద.**



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త : చేనేత కార్మికులు, రెక్కాడితే గాని డొక్కాడని కష్టజీవులు.అయితే ఓ వైపు ప్రభుత్వం నిర్లక్ష్యం, నాయకుల నిరాదరణ,మరో వైపు ఆకలిదప్పులతో శ్రీకాళహస్తిలోని చేనేత కార్మికులు తల్లడిల్లుతున్నారు. మగ్గాలపై ఆధారపడ్డ జీవితాలు నేడు నడివీధిలో పడ్డాయి. ఒకప్పటి నైపుణ్యం కల్గిన చేనేత కార్మికుల బతుకులు నేడు ఛిద్రమయ్యాయి.అగ్గిపెట్టెలో చీరను తయారు చేసిన నేతన్న నేడు పిడికెడు మెతుకుల కోసం తల్లడిల్లుతున్నారు. పనులు చేస్తామంటే ముడిసరకుల ధరల ధరలు అందుబాటులో లేదు. పనులు చేద్దామంటే భారీ పరిశ్రమల ధాటిని తట్టుకోలేకపోతున్నారు. దాంతో కొందరు మోతకూలీలుగా మారగా మరి కొందరు హోటళ్ళలో ప్లేట్లు కడటానికి పరిమిత మౌతున్నారు. మరి కొందరు బతుకుజీవనం లేక ఆత్మహత్యలే శరణ్యమన్నట్లు పరిస్థితి దాపురించింది. రేయింబవళ్లు కష్టించే నేతన్నకు అప్పుల బాధలు ఆకలి దప్పులే అన్నట్లు మారింది.

**మగ్గాలపై బతుకులు బక్కచిక్కి...**

శ్రీకాళహస్తిలోని సంప్రదాయ మగ్గాలపై బతుకుజీవనం నేడు బుగ్గిపాలన్నట్లు మారింది.నేడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్య ముడిసరకుల సంక్షోభం. ముడిసరకుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రెండేళ్ళ క్రితం కిలో పట్టు 70శాతం పెరిగినట్లు చెబుతున్నారు. దీంతో మాస్టర్ వీవర్స్ పట్టు చీరలు నేయటానికి తగిన ముడిసరకుల్లేక పనులు నేత కార్మికులకు మాస్టర్ వీవర్స్ ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో మగ్గాలపైనే ఆధారపడిజీవిస్తున్న కార్మికుల బతుకుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. నేడు ఒక కుటుంబం బతకాలంటే నెలకు కనీసం రూ.15 నుంచి 20వేల వరకు కావాలి.కానీ పనులే లేకుండా తల్లడిల్లుతుంటే ఆదుకునే దిక్కులేక ఇబ్బందులు పడుతున్నారు.కాటన్ వస్త్రాలు నేయటానికి యార్న్ ధరలతో సరకులు లభించని స్థితి గతంలో యార్న్ సులభంగా దొరికేది నేడు అది కూడా దొరకటం కష్టసాధ్యమైంది.. ఒక్క శ్రీకాళహస్తియే కాకుండా మదనపల్లి, వెంకటగిరి, వరదయ్యపాళెం ప్రాంతాల్లో చేనేత కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ప్రస్తుత సంక్షోభ పరిస్థితిలో ప్రభుత్వం స్పందించి ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు.

గత ప్రభుత్వంలో వైయస్ఆర్‌నేతన్నల నేస్తం అంటూ ప్రతి ఏడాది ఆగస్టు 8న నేతన్నల ఖాతాలో రూ.24వేలు వేసేవారని కానీ నేడు ఈ పథకం రద్దు అయ్యింది.అయితే ప్రస్తుత ప్రభుత్వం నేతన్నకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నారు.ఇంది కొంత పనులకు ఊరట అయినా పనులేలేదు. ఇక గతంలో నేతన్నల వద్ద ఉన్న బట్టలను ఆప్‌కో ద్వారా కొనుగోలు చేసే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దానిని ప్రైవేటుకు అప్పగించారు. అయితే నేతన్నలకు ఉపయోగకరంగా చిట్ ఫండ్ రూ.1000 ఖరారు చేసారు. నేతన్న రూ.1000 చెల్లిస్తే వెయ్యి రూపాయలు ప్రభుత్వం చెల్లించేందుకు పథకం సిద్ధం చేసినట్లు సమాచారం, జియస్‌టి రీఎంబర్స్‌మెంట్ అన్నారు.కానీ ఇంకా అమలు కాలేదు. బడుగు బలహీన వర్గాల్లో బతకలేక బట్టలు నేసే నేతన్న పడుతున్న అవస్థలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

# గూడూరు డివిజన్

## తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి : ఎమ్మెల్యే



గూడూరు, మే 9 ప్రభాతవార్త : వేసవిలో ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అధికారులను సూచించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నియోజకవర్గంలో ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చూడాలని, బోర్లు, మోటార్లు రిపేర్లు ఉంటే చేయించాలని, వాటర్ అందని గ్రామాలకు పైప్ లైన్లు వేయించాలని అన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా నియోజకవర్గంలో మంజూరు అయిన ఎఫ్‌డిఆర్ వర్క్‌లను సాగు నీటి సంఘం అధ్యక్షులు ద్వారా త్వరగా పూర్తి చేయించాలని అన్నారు.

## 37 లక్షలతో వసతిగృహాలకు మరమ్మతులు



కోట, మే 9 ప్రభాతవార్త : కోట మండలంలోని చిట్టేడు, కోట, నెల్లూరుపల్లి కొత్తపాలెం బిసి వసతిగృహాలకు రూ.37 లక్షలతో మరమ్మతుల పనులు చేయిస్తున్నట్లు ఎపిఇడబ్ల్యుఐడిసి డిఇ రమేష్ చెప్పారు. శుక్రవారం ఆయన కోటలోని బిసి వసతి గృహానికి సంబంధించి పనులను పరిశీలించారు. భవనాల పైకప్పు దెబ్బతినడం, గోడలు బీటలు వారడం, కిటికీలు, తలుపులు విరిగిపోవడం, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సమస్యలు గుర్తించామన్నారు. 40 ఏళ్ల నాడు నిర్మించిన భవనాలు కావడంతో పైకప్పు పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీనికి టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఆయన వెంట ఏఇ మన్సూర్, వార్డెన్ గజేంద్ర తదితరులు ఉన్నారు.

## మాలల ఆత్మీయ గౌరవ సభను విజయవంతం చేయండి

కోట, మే 9 ప్రభాతవార్త: ఈ నెల 11న తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ మహాసభ జరుగుతుందని, ఈ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు మీజూరు మాధవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయనమాట్లాడుతూ వర్గీకరణ ద్వారా ఎస్సీలలో చిచ్చుపెట్టి రాజ్యాధికారినికి దూరం చేసే కుట్రలో భాగమే అన్నారు. రానున్న రోజుల్లో మాలలంతా ఏకమై సత్తా చూపించాలన్నారు. యుద్ధంలో ప్రాణాలు త్యాగం చేసిన భారత వీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల మల్లి, పనబాక హేమంత్, దాసరి అశోక్ కాంబ్లె, చిట్టిబాబు, ఏడుకొండలు, కృష్ణ, శ్రీను, మోహన్, భూపతి, కోటి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల ఆవేదన

కోట, మే 9 ప్రభాతవార్త: కోటలోని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ వద్ద పంచాయతీ ప్రజలు వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డికి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌లకు సమస్యలు ఏకరువు పెట్టారు. వారు మాట్లాడుతూ ఆహార వ్యర్థాలు, సేంద్రియ వ్యర్థాలు వంటివి కుళ్లిపోయి దుర్వాసన వస్తుంటాయని, అలాంటి వాటిని తడి చెత్తను తాము ఎంతో కష్టమైనా వృత్తిధర్మంగా భావించి ఇష్టంగానే పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సేవలందిస్తున్న తమ పట్ల కోట పట్టణ ప్రజలు చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని ఉద్యోగాలు చేయాలంటే ఇబ్బందికరంగా ఉందని కార్మికులు వాపోయారు. కొందమంది ప్రజలు అసభ్యకరంగా దూషిస్తున్నారని వాపోయారు. వినోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పట్ల మంచిగా వ్యవహరించాలని, చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకూడదని అన్నారు.

## ఘనంగా ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



సూళ్లూరుపేట, మే 9 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని జిఎన్‌టి రోడ్డులో వెలసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 332వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాళ్లు ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూలేటి విజయలక్ష్మి, మెస్ రమణయ్య, బట్టా సుబ్రహ్మణ్యం, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## తడ ఎంపిడిఓగా శేఖర్ నాయక్ నియామకం

తడ, మే 9 ప్రభాతవార్త: తడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శేఖర్‌నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన అన్నమయ్య జిల్లా నుంచి సాధారణ బదిలీలలో భాగంగా తడకు వచ్చారు. ఇప్పటిదాకా ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓగా ఉన్న విజయకుమార్ ఇక నుంచి డిప్యూటీ ఎంపిడిఓగా కొనసాగుతారు. బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ మండల సమస్యల పరిష్కారానికి ఆయా సచివాలయాల సిబ్బంది, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, అధికారులతో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## భారత జవాన్లకు న్యాయవాదుల సంఘీభావం



నాయుడుపేట, మే 9 ప్రభాతవార _; భారత ఆర్మీ ఈనెల 7వతేదిరాత్రి జరిపిన ఆపరేషన్ సిందూర్ సెక్స్‌స్‌పై భారత జవాన్లకు నాయుడుపేట బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం సంఘీభావం తెలియజేశారు.ఆయన ఆధ్వర్యంలో న్యాయవాదులు నాయుడుపేట బార్ అసోషియేషన్ కార్యాలయంలో విలేఖర్లు సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య మాట్లడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల శిబిరాలపై దాడి విజయవంతం చేసిన భారత ఆర్మీజవాన్లకు సంఘీభావం తెలియజెస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు ధశయ్య,పసల గంగాప్రసాద్, కిషోర్, చెగయ్య తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## చంద్రగిరి నియోజక వర్గ అభివృద్ధికి సహకరించండి.!

**- జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే పులివర్తి నాని సుదీర్ఘ చర్చ...వినతి**
**- అండగా ఉంటానని నానికి కలెక్టర్ హామీ**



తిరుపతి కలెక్టరేట్, మే 9 ప్రభాతవార్త : గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రగిరి నియోజక వర్గం అభివృద్ధిలో చిన్నాభిన్నమైందని, నియోజక వర్గ ప్రజలు అనే సమస్యలతో నిత్యం పోరాడుతూ కొట్టుమిట్టాడు తుండేవారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడం. చంద్రగిరి నియోజక వర్గ ఎమ్మెల్యేగా మొట్టమొదట పులివర్తి నానిని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక పక్క పులివర్తి నాని, మరో పక్క ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి, ఇంకో ప్రక్క కుమారుడు వినిల్ నియోజక వర్గం అభివృద్ధిపై ప్రతి గ్రామ పంచాయితీలో సుడిగాలి పర్యటనలు చేస్తున్న విషయం అందరికి విధితమే. అంతే కాకుండా గత ప్రభుత్వంలో ఎవరైనా ఇబ్బందులకు గురిఅయినా, ఏవైనా గ్రామాల్లో సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకుని రావాలని ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినిల్ ప్రత్యక్షంగా, పరోక్షంగా నియోజక వర్గ ప్రజలకు సభలు, సమావేశాలు, స్వయంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి చెప్పారు. ఈ నేపథ్యంలో పులివర్తినాని మరో అడుగు ముందుకేసి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజక వర్గ అభివృద్ధిపై పలు పర్యాయాలు అసెంబ్లీలో నియోజక వర్గ అభివృద్ధిపై తన వాణిని వినిపించారు. దీనిలో భాగంగా శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిసి నియోజక వర్గ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందించాలని కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించి అటు పిమ్మట వినతి పత్రం ద్వారా నాని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ వెంటనే స్పందించి నియోజక వర్గ అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటానని నానికి కలెక్టర్ హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

## గంగమ్మకు రంగస్థలి సారె సమర్పణ





తిరుపతి(రవాణ)మే 9 ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకల్లో బాగంగా శుక్రవారం సాయంత్రం రాయలసీమ రంగస్థలి, ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ,మోహన్‌రామ్‌రెడ్డి దంపతులు సారెను సమర్పించారు. సాయంత్రం కళాకారులు వివిధ రకాల వేషధారణలతో అమ్మవారి ఆలయంకు చేరుకున్నారు. లయబద్ధంగా కళాకారులు నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఇక్కడ ఆలయంలో ఆలయ ఈఓ జయకుమార్ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో స్వామిప్రతాప్,కళాకారులు శాంభోలు హరినాత్, కెఎన్ రాజా, కల్యాణి, కస్పాపద్మనాభం, బ్రహ్మానందరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, గంగాధర్, జయంత్‌కుమార్, చెంగల్‌రాయలు పాల్గొన్నారు.